క్లుప్తంగా

వైభవంగా హనుమజ్జయంతి మహోత్సవాలు



పొన్నూరు: పట్టణంలోని శ్రీ సహస్రలింగేశ్వర స్వామి, వీరాంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, మూలమూర్తికి అభిషేకం, అలంకారాలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామికి లక్ష తమలపాకుల పూజ, నివేదన, నీరాజనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వాహణాధికారి గద్దె వెంకట అమర్‌నాథ్ పర్యవేక్షించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ

పొన్నూరు: మండలంలోని ఉప్పరపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, పార్టీ మాజీ మండలాధ్యక్షులు సూరిశెట్టి శ్రీనివాసరావును పార్టీ నాయకులు పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై ఆరోగ్యం కుదుటపడిన నేపథ్యంలో నియోజకవర్గం పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా పార్టీ సీనియర్ నాయకులు ఆకుల వెంకటేశ్వరరావు, పలువురు నాయకులు ఆయనను పలకరించారు.

1వ తేదీ నుంచి దుకాణాల్లో రేషన్ పంపిణీ

ప్రత్తిపాడు: చౌక ధరల దుకాణ నిర్వాహకులు వచ్చే నెల నుంచి లబ్ధిదారులకు తమ దుకాణాల్లో రేషన్ సరుకులు అందించేందుకు సిద్ధం కావాలని ప్రత్తిపాడు సీఎస్ డీటీ శివశంకర్ అన్నారు. జూన్ 1వ తేదీ నుంచి రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీ జరగనున్న నేపథ్యంలో బుధవారం డీటీ శివశంకర్ మండలంలోని రేషన్ దుకాణాలలో తనిఖీలు నిర్వహించి డీలర్లతో మాట్లాడారు. అనంతరం సౌకర్యాలను పరిశీలించారు. మిషన్లు, రిజిస్టర్లు అన్నీ సిద్ధం చేసుకోవాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తొలి రోజు నుంచే రేషన్ సక్రమంగా పంపిణీ చేయాల్సి ఉంటుందని వివరించారు. దుకాణాల ద్వారా 15వ తేదీ వరకు పంపిణీ కొనసాగుతుందని, ప్రజలు కూడా విషయాన్ని గమనించాలని కోరారు.

భూ సమస్యల పరిష్కారానికే రీ సర్వే

పొన్నూరు: అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యల పరిష్కారానికే రీ సర్వే నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ అన్నారు. బుధవారం మండలంలోని పెదపాలెం గ్రామంలో ఆయన రీ సర్వేపై గ్రామసభ నిర్వహించి మాట్లాడారు. రీ సర్వే ద్వారా రైతులకు సంబంధించిన భూ వివాదాలు నూరు శాతం పరిష్కారమవుతాయని అన్నారు. వల్లభరావుపాలెం గ్రామాన్ని రీ సర్వే పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి గ్రామాన్ని 18 బ్లాక్‌లుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వల్లభరావుపాలెం గ్రామంలో పెదపాలెం, ఉప్పరపాలెం, సీతారామపురం గ్రామాలకు సంబంధించిన రైతులు కూడా భూములు ఉన్నాయని చెప్పారు. ఈ నెలలో రీ సర్వేని పూర్తి చేసే విధంగా సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు. మండల సర్వేయర్ అడపాల సత్యనారాయణ, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి నివాళి

పెదకాకాని: మండల కేంద్రమైన పెదకాకానిలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ఘన నివాళులర్పించారు. ఆయన విగ్రహానికి, మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు జొన్నల వెంకటరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మీరావలి, గాదె నాగేశ్వరరావు, బుల్లా మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకుని మహిళ బలవన్మరణం

పెదకాకాని: ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన వెంకటకృష్ణాపురం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదకాకాని మండలం వెంకటకృష్ణాపురానికి చెందిన దానబోయిన వంశీకి 7 ఏళ్ల క్రితం వెంకటరమణ(28)తో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో వెంకటరమణ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కొంత సేపటి తర్వాత ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు ఫ్యానుకు వేలాడుతున్న వెంకటరమణను చూసి కిందకు దించారు. అప్పటికే ఆమె మృతి చెందిందని వంశీ కుటుంబ సభ్యులు తెలిపారు. సంఘటనా స్థలానికి పెదకాకాని పోలీసులు చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మహిళ మృతికి గల కారణాలు తెలియరాలేదు.

చేబ్రోలు మేజర్ పంచాయతీ ఆదాయానికి గండి

- ఏడాదైనా చెల్లించని వేలం పాట సొమ్ము
- రూ.7 లక్షలకు పైగా పంచాయతీకి ఎగనామం



అధిక ధరలో వేలం పాడిన షాపింగ్ కాంప్లెక్స్

చేబ్రోలు: వేలం పాట దారులకు కూటమి నేతల అండ ఉండడంతో చేబ్రోలు మేజర్ గ్రామ పంచాయతీ ఆదాయానికి గండి పడుతోంది. పాట దారులు డబ్బులు చెల్లించకపోతే వారిని ప్రశ్నించే వారు కరువయ్యారు. ఏడాది క్రితం మార్కెట్టు రుసుం వసూలు కోసం నిర్వహించిన వేలం పాటలో పాట దారుడు ఏడాదిగా రూ.లక్షల్లో డబ్బులు చెల్లించకపోవటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కి పంచాయతీ అధికారుల అండదండలతో అక్రమ వసూళ్లు జరపడం పలు విమర్శలకు దారి తీస్తోంది. మేజర్ గ్రామ పంచాయతీలో ఏడాది పాటు తోపుడు బళ్లు, రోడ్డుపై వ్యాపారం చేసుకునే వారి నుంచి రుసుం వసూలు చేయడానికి 2024–25 సంవత్సరంలో వేలం పాట నిర్వహించారు. వేపూరి బసవపున్నయ్య రూ.9 లక్షలకు పాట పాడుకున్నారు. పాడుకున్న కొద్ది రోజులకు పాట దారుడు రూ.2 లక్షలు చెల్లించాడు. మిగిలిన రూ.7 లక్షలు నేటికీ చెల్లించలేదు. ఏడాది పాటు గ్రామంలో చిరువ్యాపారుల నుంచి రుసుం వసూలు చేస్తున్నప్పటికీ పంచాయతీకి చెల్లించాల్సిన డబ్బులు మాత్రం జమ చేయలేదు.

9 షాపులకు నెలకు రూ.1.30 లక్షలు..

చేబ్రోలు గ్రామ దేవత శ్రీరాములమ్మ తల్లి ఆలయ సమీపంలోని పంచాయతీకి చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌కు చెందిన 9 షాపులకు కొద్ది రోజుల క్రితం వేలం పాటలు నిర్వహించారు. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా పంచాయతీకి నెలకు రూ.1,29,500లు సమకూరనుంది. 2015లో షాపులు నిర్మించినప్పటి నుంచి ఇప్పటి వరకు ఇంత పెద్ద మొత్తంలో అద్దెకు పాట పాడుకున్న దాఖలాలు లేవు. గతేడాది ఒక్కో షాపు నుంచి నెలకు రూ.1500ల నుంచి రూ.2,500లు మాత్రమే పంచాయతీకి ఆదాయం వచ్చేది. పాట దారులు బినామీలకు షాపులను అద్దెకు ఇచ్చి నెలకు రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు లబ్ధి పొందుతున్నారు. 9 షాపుల్లో 3 షాపులు ఎస్సీలకు, 3 షాపులు ఓసీలకు, 2 షాపులు బీసీలకు, 1 షాపు ఎస్టీలకు వేలం పాటల్లో షాపులు కేటాయింపు జరిపారు. పాట దారులు అడ్వాన్స్ డిపాజిట్‌లు చెల్లించి షాపులు నిర్వహించుకోవాల్సి ఉంది. ఇంత పెద్ద మొత్తంలో పోటీపడి దక్కించుకున్న వారిలో అధికార పార్టీకి చెందిన వారు డబ్బు చెల్లిస్తారా.. లేదా అనే విషయంలో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



చేబ్రోలు గ్రామ సచివాలయం

అధికారి ఏమన్నారంటే..

దీనిపై పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావును 'సాక్షి' వివరణ కోరగా.. గతేడాది మార్కెట్టు రుసుం కోసం వేలం పాట దక్కించుకున్న బసవపున్నయ్య పంచాయతీకి రూ.7 లక్షలు చెల్లించాల్సిన విషయం వాస్తవమన్నారు. పంచాయతీకి చెల్లించాల్సిన డబ్బుల విషయంపై తమకు నష్టం వచ్చినందున చెల్లించలేకపోతున్నట్లు చెబుతున్నట్లు పేర్కొన్నారు. దీనిపై జిల్లా ఎస్పీకి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి డబ్బులు వసూలు చేస్తామని అధికారి అన్నారు.

జేఎంజే శక్తి సదన్ పరిశీలన



జేఎంజే శక్తి సదన్‌ను పరిశీలిస్తున్న రాయపాటి శైలజ

పెదకాకాని: రాష్ట్రంలో దాడులు, అన్యాయానికి గురైన మహిళలకు భరోసా, భద్రత కల్పించి వారికి న్యాయం చేయడమే లక్ష్యమని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. పెదకాకాని మండలం నంబూరు జేఎంజే శక్తి సదన్‌ను బుధవారం ఆమె పరిశీలించారు. మహిళా ప్రాంగణంలోని శక్తి సదన్ ఒన్ స్టాప్ సెంటర్‌ను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా 441 శక్తి సదన్‌లు ఉంటే రాష్ట్రంలో 27 శక్తి సదన్‌లు నడుస్తున్నాయన్నారు. శక్తి సదన్‌లో బాధిత మహిళలకు వసతి, ఆహారం, ఆరోగ్యంతో పాటు, అవసరమైన వారికి లీగల్ సహాయం అందిస్తామని, స్వయం ఉపాధికి అవసరమైన శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ సెక్రటరీ బి.వసంతబాల, జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాజెక్ట్ డైరక్టర్ విజయలక్ష్మి, మహిళా ప్రాంగణం మేనేజర్ రమణశ్రీ, ఏడీ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి లక్ష తమలపాకులతో ఆకు పూజ

నగర పుర వీధుల్లో వైభవంగా గ్రామోత్సవం



భక్తుల కోలాటం



స్వామి వారికి లక్ష తమలపాకుల పూజలో భక్తులు

నగరంపాలెం: స్థానిక కొత్తపేట(నాజ్ కూడలి)లోని ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారి హనుమత్ జయంత్యుత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం పంచామృత స్నపన, అనంతరం స్వామికి లక్ష తమలపాకులతో ఆకుపూజ నిర్వహించారు. రాత్రి గ్రామోత్సవం చేపట్టారు. కనక తప్పెట్లు, మంగళ వాయిద్యాలు, దేవతామూర్తుల వేషధారణలు అలరించాయి. చిన్నారులు, మహిళా భక్తుల కోలాటం మరింతగా ఉత్తేజపరిచాయి. భక్తి గీతాలు ఆలపించారు. 108 మహిళలతో దీపాలంకరణలులతో వైభవంగా స్వామి గ్రామోత్సవం కొనసాగింది. నాజ్ కూడలి, కొత్తపేట తదితర ప్రాంతాల మీదగా గ్రామోత్సవం కొనసాగగా, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను భక్తులకు అందించారు. విద్యుద్దీపాలంకరణతో దేవాలయాన్ని అలకరించారు. కార్యక్రమంలో శ్రీ హనుమాన్ దీక్ష సమాజం అధ్యక్షులు తిరువళ్ళూరు వెంకటసుబ్బారావు, దేవస్థానం ఈఓ టి.సుభద్ర, సమాజం సభ్యులు నాగేశ్వరరావు, వంశీ ప్రసాద్, రమేష్, వెంకట రమణ, మారుతి, సుబ్రహ్మణ్యం, బాపిరాజు పాల్గొన్నారు.

అమెరికాను భారత్ ధైర్యంగా ఎదుర్కోవాలి



లక్ష్మీపురం: భారత దేశ భవిష్యత్ ప్రభావితం చేసే అంశాలపై అమెరికా అధ్యక్షుడు పదే పదే జోక్యం చేసుకోవడం ఆందోళకరమని అమెరికా ఏక పక్ష విధానాలను భారత్ ధైర్యంగా ఎదుర్కోవాలని జీవన సంధ్య అధ్యక్షుడు ఎస్.కృష్ణారావు అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన చర్చ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత దేశ అంతర్గత అంశాల్లో జోక్యం చేసుకోవడం దేశ సార్వ భౌమాధికారాన్నే సవాల్ చేస్తూ మాట్లాడుతున్న తీరుకి చెక్ పెట్టడానికి బదులు కనీసం నోరు మెదపటానికి కూడా కేంద్రంలోని పెద్దలు ఇష్టపడక పోవడం అగ్ర రాజ్యానికి జీ హుజూర్ అనటమే అన్నారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, విశ్రాంత అధికారి వి.ఎస్.ఎన్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ ట్రంప్ అధికారంలోకి వచ్చింది మొదలు తీసుకున్న నిర్ణయాలన్నీ భారత్ ప్రయోజనాలకు నష్టం చేసేలా ఉన్నాయన్నారు.

ఉగ్రవాద దాడి ఆటవిక చర్య

లక్ష్మీపురం: ఉగ్రవాద మూకల దాడి ఆటవిక చర్య అని ఆర్‌టీసీ విశ్రాంత అధికారి ఎల్.మురళీకృష్ణ అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం సందర్భంగా 'భారతదేశానికి విషమ సమస్యగా మారిన ఉగ్రవాదం' అన్న అంశంపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉక్రెయిన్, రష్యా యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తుంటే మరో పక్క ఇజ్రాయిల్ హమాస్ దాడులు గాజాను రక్తసిక్తం చేస్తున్నాయన్నారు. పాక్ ప్రేరణతో భారత్‌లో ఉగ్రవాదం ప్రబలి అమాయకులు కాల్చి చంపబడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పొరుగు దేశాల్లోని ఉగ్రవాదుల పంజాకు భారతదేశం మూల్యం చెల్లించుకోవడం ఇంకా కొనసాగుతూనే ఉందన్నారు. రాజ్యాంగ చర్చా వేదిక కన్వీనర్ అవధానుల హరి, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, విద్యావేత్త చంద్రయ్య, విశ్రాంత అధికారి మల్లేశ్వరరావు ప్రసంగించారు.

దివంగత రాజీవ్ గాంధీకి ఘన నివాళి



రాజీవ్ గాంధి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

లక్ష్మీపురం: అతి పిన్న వయసులోనే ప్రధాన మంత్రి పదవిని అధిష్టించిన రాజీవ్ గాంధీ దేశ భవిష్యత్‌కు బాటలు వేశారని అఖిల భారత కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ, గుజరాత్ రాష్ట్ర ఇన్‌చార్జి ఉషారాణి, ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం పాల్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం దేశ మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధి వర్ధంతి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ కూచిపూడి విజయమ్మ, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బి.సునీల్, నాగేశ్వరరావు, జె.వెంకటరెడ్డి, కె.నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, కరీం, తిరుమలరావు, ఖాదర్ వలి బాషా, కొండయ్య పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నివారించాలి



చేబ్రోలు: బాల్య వివాహాల నిర్మూలనకు జీవో నంబరు 31ని కఠినంగా అమలు చేయాలని ఎంపీడీవో ఎ.ఉమాదేవి అన్నారు. చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, పోక్సో, బాల కార్మికుల నిరోధంపై మండల స్థాయి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, మహిళా పోలీసులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు కార్యక్రమానికి హాజరయ్యారు. ఉమాదేవి, క్రాస్ జిల్లా సమన్వయకర్త కోలా సుకుమార్ తదితరులు మాట్లాడుతూ.. బాల్య వివాహాల చట్టాన్ని ఎవరైనా అతిక్రమిస్తే వారికి 2 ఏళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తామన్నారు. బాల్య వివాహాలకు సహకరించినా, ప్రోత్సహించినా వారు కూడా శిక్షార్హులని తెలిపారు.

వైద్యాధికారులకు శిక్షణ కార్యక్రమం

గుంటూరు మెడికల్: స్థానిక డీఎంహెచ్ఓ కార్యాలయంలో బుధవారం పీహెచ్, యూపీహెచ్, తదితర ఆస్పత్రుల్లో పనిచేసే వైద్య అధికారులకు రొటీన్ ఇమ్యూనైజేషన్ నూతన మ్యాన్యువల్ 2024–25పై నిర్వహించిన మూడురోజుల శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఆరోగ్య కేంద్రం పరిధిలో టీకాల కార్యక్రమం సమర్థంగా ఏ ఒక్క గర్భిణి, చంటి బిడ్డ, మిస్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. గ్రామ స్థాయిలో హెడ్ కౌంట్ సర్వే నిర్వహించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు కోరారు. సర్వేలెన్స్ వైద్య అధికారి డాక్టర్ ఎ.భవానీ, యూఎన్‌డీపీ ప్రోగ్రాం అధికారి ఎం.మధుకరరావు ప్రాధాన్యాన్ని వివరించారు.

మూడు వంతెనల వద్ద డ్రెయినేజీ సమస్య లేకుండా చర్యలు



నెహ్రూనగర్: నగరంలోని మూడు వంతెనల దగ్గర డ్రెయినేజీ సమస్య లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో కలసి వంతెనల దగ్గర పర్యటించి వర్షం నీరు నిలబడకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. మేయర్ మాట్లాడుతూ శంకర్ విలాస్ ఆర్వోబీ తరువాత గుంటూరు పశ్చిమ, తూర్పు నియోజకవర్గాలకు అతి ముఖ్యమైన వారధిగా మూడు వంతెనల మార్గం ఉందని, త్వరలో ఆర్వోబీ పనులు ప్రారంభిస్తే ట్రాఫిక్ మళ్లింపుకు కూడా ఇదే ప్రధాన మార్గం అవుతుందని చెప్పారు. అటువంటి కీలకమైన ప్రాంతంలో రోడ్ల విస్తరణకు స్థల సేకరణ చేయడం జరిగిందన్నారు. కాని చిన్నపాటి వర్షానికి కూడా ఈ ప్రాంతం బురద చేరుకోవడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్య పరిష్కారానికి శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని సూచించారు. తక్షణమే మురుగు నిలవకుండా డ్రెయిన్ నిర్మాణం చేయాలని, స్థల సేకరణ జరిగిన ప్రాంతంలో రోడ్డు నిర్మాణం చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. అవుట్ ఫాల్ డ్రెయిన్ బయటకు వెళ్లే మార్గం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం ఉన్న డ్రెయిన్లు, కల్వర్టుల వద్ద సిల్ట్‌ను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పర్యటనలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, ఈఈ సుందర్రామిరెడ్డి, డీఈఈలు హనీఫ్, నాగభూషణం పాల్గొన్నారు.

జనసేన పార్టీ జెండా దిమ్మెపై గ్లాసు ధ్వంసం

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం పల్లపాడులో ఆగాంతకులు గ్రామంలోని జనసేన పార్టీ జెండా దిమ్మె వద్ద ఉన్న గ్లాసును మంగళవారం రాత్రి పగలగొట్టారు. బుధవారం ఉదయం గ్లాసు పగిలి ఉండడంతో జన సైనికులు విషయాన్ని పార్టీ నాయకులు, పోలీసులకు సమాచారం అందించారు. వట్టిచెరుకూరు సీఐ రమానాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ప్రారంభమైన శ్రీ ప్రపత్తాంజనేయుని బ్రహ్మోత్సవాలు



అలంకరణలో స్వామివారు

పొన్నూరు: మండల పరిధిలోని నండూరు గ్రామంలో కొలువైన శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో స్వామివారి కల్యాణ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ఉదయం విఘ్నేశ్వర పూజతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామి అనుగ్రహం పొంది తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను హనుమత్ పీఠం నిర్వాహకులు వల్లూరు శ్రీనివాస శర్మ పర్యవేక్షించారు. గురువారం హనుమజ్జయంతి పురస్కరించుకుని ఉదయం నిత్య అనుష్టానములు, స్వామికి విశేష ద్రవ్యాలతో అభిషేక అర్చనలు, శతసహస్ర నాగవల్లీ దళార్చన, హోమాలు, అనంతరం తీర్థప్రసాద వితరణ జరుగుతాయని శ్రీనివాస శర్మ తెలిపారు. హనుమజ్జన్మ కథ, సాయంత్రం లలితా విష్ణు సహస్రనామ పారాయణ, సహస్ర నామార్చన, హోమం, పంచహారతులు, వేద స్వస్తి ఉంటాయన్నారు. భక్తులు కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

విజేతలకు బహుమతులు ప్రదానం



బహుమతులు అందుకున్న వారితో సీఐ వీరానాయక్

పొన్నూరు: జ్ఞాపక శక్తితో పాటు, నైపుణ్యాలను మెరుగు పరుచుకునేందుకు చదరంగం ఆట దోహదపడుతుందని పట్టణ సీఐ ఎల్.వీరానాయక్ అన్నారు. స్థానిక కల్యాణ మండపంలో బాలాజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో అండర్–2 బాల బాలికలకు జిల్లా స్థాయి చదరంగం పోటీలు నిర్వహించారు. అనంతరం సభలో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సీఐ వీరానాయక్ పాల్గొని విజేతలు కట్టెపోగు హర్షిత్, పునీత్ శ్రీ లక్ష్మీ కార్తికేయ, లక్ష్మీ చేతన, కావ్యలకు బహుమతులు, మెమొంటోలు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న బాల, బాలికలు నలుగురు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో జిల్లా చెస్ ప్రెసిడెంట్ రవీంద్రరాజు, డాక్టర్ శివకుమార్, డాక్టర్ కీర్తి, డాక్టర్ హిమబిందు, సూర్యనారాయణ పాల్గొన్నారు. గంగరాజు, షేక్.జానీబాషా, సీఎల్ శ్రీనివాస్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

గృహ నిర్మాణాలు వెంటనే చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న జియావుల్ హక్

పొన్నూరు: ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు పొజిషన్ సర్టిఫికెట్లు పొందిన లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణాలు చేపట్టాలని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ అన్నారు. బుధవారం తమ కార్యాలయంలో హౌసింగ్‌కు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. హౌసింగ్ ఏఈ షేక్. జానీబాష మాట్లాడుతూ.. మండలంలో 380 మంది లబ్ధిదారులలో ఇప్పటివరకు 147 మందికి పొజిషన్ సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు. మిగిలిన లబ్ధిదారులకు వెంటనే అందజేయాలని తహసీల్దార్ ఆదేశించారు. వీఆర్వోలు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. విధుల్లో అలసత్వం వీడాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖర రావు, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రామారావు, జూనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం పెంపు



కార్యక్రమంలో సుబ్బరత్నమ్మ, విద్యార్థులు

పెదకాకాని: విద్యార్థులు రోజూ గ్రంథాలయానికి వచ్చి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ అన్నారు. పెదకాకాని శాఖ గ్రంథాలయాన్ని బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా 24వ రోజు విద్యార్థులకు స్టోరీ రీడింగ్, స్టోరీ టెల్లింగ్, యోగా, పుస్తక ప్రదర్శన, ఇన్ డోర్ గేమ్స్ ఆటల పోటీలు నిర్వహించారు. సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకను వెలికితీసి, వారు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవటానికి ఈ సమ్మర్ క్యాంపులు దోహదపడతాయన్నారు. రికార్డులను పరిశీలించి, సమ్మర్ క్యాంపు నిర్వహణ గురించి సంతృప్తి వ్యక్తం చేశారు. శాఖా గ్రంథాలయాధికారి తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీకి ఏకాగ్రత, పట్టుదలతో సన్నద్ధం కావాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షలకు వ్యవధి తక్కువగా ఉన్న నేపథ్యంలో అభ్యర్థులు ఏకాగ్రత, పట్టుదలతో చదవాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. సదరన్ ప్రైవేటు లెక్చరర్, టీచర్ ఆర్గనైజేషన్ (ఎస్పీఎల్‌టీఓ) ఆధ్వర్యంలో బుధవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఎడ్యుకేషనల్ సైకాలజీ మెటీరియల్‌తో కూడిన పుస్తకాలను డీఎస్సీకి సన్నద్ధమవుతున్న ప్రైవేటు ఉపాధ్యాయులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ డీఎస్సీకి పోటీ తీవ్రంగా ఉందని, ఉద్యోగాన్ని సాధించాలనే లక్ష్యంతో అభ్యర్థులు శ్రమించాలని సూచించారు. ప్రణాళికాబద్ధంగా క్రమపద్ధతిలో చదివితే అనుకున్న విధంగా విజయం సాధించగలరని అన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ, అధ్యాపకుల సంక్షేమం కోసం పని చేస్తున్న ఎస్పీఎల్‌టీఓ అధ్యక్షుడు డాక్టర్ పయర్ల నాగయ్యను అభినందించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ఎం.రాకేష్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు కె.రాము పాల్గొన్నారు.